సాక్షి సూర్యాపేట

గురువారం • 1 • ఆగస్టు • 2024



బలహీనంగా సాగర్ కాల్వకట్ట
సాగర్ ప్రాజెక్టు నీటి విడుదల వేళ ఎడమ కాల్వ కట్ట పలుచోట్ల బలహీనంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



నలుగురి అరెస్ట్
గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను నల్లగొండ డీఎస్పీ వెల్లడించారు. - 8లో



బెల్లం, సారా పట్టివేత
ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న బెల్లం, సారాను బుధవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం జిల్లాలో ఆసక్తిగల ప్రభుత్వ, లోకల్ బాడీ యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాల కనీస బోధనానుభవం ఉన్న గ్రేడ్-2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, 10 సంత్సరాల కనీస బోధనానుభవం ఉన్న ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5గంటల లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రెండు సెట్ల దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఎలాంటి కేసులు లేవని ధ్రువీకరణ పత్రం కూడా వీటి వెంట జత పర్చాలని సూచించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ కోటా చలం సూచించారు. ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట మండల వైద్యాధికారి మౌనిక, సీహెచ్ఓ యాదగిరి, మాణిక్య, కొండ్ల శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా దేవభిక్షం



దేవభిక్షం మాదిగకు నియామక పత్రం ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌మాదిగ

మఠంపల్లి: మఠంపల్లి మండలం పెదవీడుకు చెందిన టీఎమ్మార్పీఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలక దేవభిక్షం మాదిగను రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా దేవభిక్షం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ లక్ష్య సాధనకు శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు.

పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ

నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్- 1, గ్రేడ్- 2 వారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. నల్లగొండ సబ్ రిజిస్ట్రార్-1గా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు, నల్లగొండలో ఏఆర్‌గా పనిచేస్తున్న రఘువర్ధన్ నల్లగొండ-1 సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. నల్లగొండలోనే సబ్ రిజిస్ట్రార్-2గా పనిచేస్తున్న అలివేలు మంగను నల్లగొండ ఆడిట్ విభాగంలో సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. రామన్నపేట సబ్ రిజిస్ట్రార్ పి.నగేష్ నల్లగొండ సబ్ రిజిస్ట్రార్-2గా బదిలీ అయ్యారు. భువనగిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీను చండూరుకు, నకిరేకల్ సబ్ రిజిస్ట్రార్ అన్వేషితను జనగామకు, చౌటుప్పల్‌లో పనిచేసే సాయి వికాస్‌ను దేవరకొండకు, చండూరులో పనిచేసే అనూషను యాదగిరిగుట్టకు, యాదగిరిగుట్టలో పనిచేసే కిషోర్‌ను కొడకండ్ల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. దేవరకొండలో పనిచేసే సందీప్‌ను చౌటుప్పల్‌కు బదిలీ చేశారు. కోదాడలో పనిచేసే అశోక్ మోత్కూర్‌కు, మిర్యాలగూడలో పనిచేసే అరవింద్ కోదాడకు బదిలీ అయ్యారు. బీబీనగర్‌లో పనిచేసే బలరాంను మిర్యాలగూడకు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పనిచేసే నరేష్ బీబీనగర్‌కు బదిలీ అయ్యారు. కాగా, నల్లగొండ ఆడిట్ విభాగంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మధుకర్‌ను నల్లగొండ ఏఆర్ విభాగానికి బదిలీ చేశారు.

బీజేపీ ఎంపీలు ఎందుకు నోరుమెదపలేదు

హుజూర్‌నగర్ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగినా రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ఎందుకు నోరుమెదపలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం సీజన్ కు రైతు భరోసా డబ్బులు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు యాదగిరిరావు ,పల్లె వెంకటరెడ్డి, డి. బ్రహ్మం, వి. సైదులు, సీహెచ్ నరసయ్య, హుస్సేన్, శీలం శీను, వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, వెంకటి పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు.. ప్రజల పాట్లు



ఇది.. సూర్యాపేట పట్టణంలోని ఆర్‌కె గార్డెన్స్‌లో నివాస గృహాల మధ్య పారిశుద్ధ్యం లోపించింది. ప్లాట్ల యజమానులు నిర్వహణను పట్టించుకోకుండా వదిలేయడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయి విషకీటకాలకు నిలయంగా మారాయి. మురుగును తొలగించాలని మున్సిపల్ అధికారులు గతంలో నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు.



ఇది సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు నీరు నిలిచి మురుగుకూపంగా మారింది. దీని ద్వారా వచ్చే దుర్వాసనతో చుట్టుపక్కల నివాసం ఉండే వారు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది వీరికి కంటిమీదకునుకులేకుండా పోయింది. రోగాల బారిన పడే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- సూర్యాపేట పట్టణంలో అపరిశుభ్రంగా ఖాళీ స్థలాలు
- దోమలు, విషకీటకాలకు నిలయం
- కాలనీల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం
- మురుగునీటి దుర్వాసనతో ఇబ్బందులు
- పట్టింపులేని పాలకులు

సూర్యాపేట మున్సిపాలిటీలో ఇలా..

వార్డులు	జనాభా
48	3లక్షలు

ఖాళీ స్థలాల సమస్య ఉన్న ప్రాంతాలు **6,853**

సూర్యాపేట: చాలా మంది భవిష్యత్ అవసరాల కోసం సూర్యాపేట పట్టణంలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకోకుండానే వదిలేస్తున్నారు. కనీసం నిర్వహణ చర్యలు తీసుకోవడంలేదు. ఇళ్ల కంటే ప్లాట్లు లోతట్టుప్రాంతాల్లో ఉండడంతో వర్షాలకు వరదనీరు చేరడమే కాకుండా పిచ్చి మొక్కలు పెరిగి మురుగు కూపాలుగా మారుతున్నాయి. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం.. ఆపై పరిసరాల అపరిశుభ్రతతో పట్టణవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పట్టణంలో డెంగీ కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. పారిశుద్ధ్యం నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

తటాకాలుగా..

సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డులు ఉండగా వీటిలో సుమారు 3 లక్షల జనాభా నివాసం ఉంటోంది. జిల్లా గా ఏర్పడడంతో సూర్యాపేట పట్టణంలో స్థిరాస్తివ్యాపారం జోరందుకుంది. కొందరు ఇష్టారీతిన నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. గతంలో ఉన్న కాలనీలతో పాటు కొత్తగా ఏర్పడిన వాటిలో ఓపెన్‌ప్లాట్లు స్థానికులకు పెద్ద సమస్యగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి తటాకాలుగా మారుతున్నాయి. వీటిలో పిచ్చి మొక్కలు పెరగడం, పందులు తిరగడం, ఇతర కీటకాలకు ఆవాసాలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణంలోని తాళ్లగడ్డ, జమ్మిగడ్డ, పీఎస్సార్‌సెంటర్, శ్రీరాంనగర్, దురాజ్‌పల్లి, కుడకుడ, అంజనాపురికాలనీ, వెంకటేశ్వరకాలనీ, విలీన గ్రామపంచాయతీల్లోని రాయినిగూడెం, పిల్లలమర్రితో పాటు పలు కాలనీల్లో ఖాళీ స్థలాల్లో అపరిశుభ్రతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పిచ్చి మొక్కలు పెరిగి..

ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి దోమలు, విష కీటకాలతో కాలనీవాసులు ఇబ్బందులు పడడం పరిపాటిగా మారింది. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల యజమానులతో పాటు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. విలీన పంచాయతీలు, పట్టణ శివారు ప్రాంతాల్లో అయితే సమస్యను వర్ణించలేని విధంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

దోమలు బాబోయ్..

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నమోదవుతున్న డెంగీ కేసులు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నెలలో ఐదు డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక డెంగీతో పాటు ఇతర విష జ్వరాల ముప్పు పొంచి ఉందని, తక్షణమే పట్టణంలో ఖాళీ స్థలాలను శుభ్రం చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజల కోరుతున్నారు.

నోటీసులు ఇస్తాం

ఖాళీ స్థలాలపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించాం. శుభ్రం చేయించుకోని యజమానులకు నోటీసులు ఇస్తాం. ఫైన్ వేసి ఆ స్థలాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుభ్రం చేయిస్తాం. జరిమానా కట్టకుంటే ఇంటి అనుమతి, రిజిస్ట్రేషన్ సమయాన అనుమతులు ఆపేలా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య లోపంలేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– బి.శ్రీనివాస్, కమిషనర్, సూర్యాపేట మున్సిపాలిటీ

హామీల అమలుకు ఉద్యమించాలి

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంనాయక్



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంనాయక్

మఠంపల్లి: రాష్ట్రంలో గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసేలా గిరిజనులు ఉద్యమించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామావత్ శ్రీరాంనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మఠంపల్లి మండల కేంద్రంలో సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గిరిజనుల పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఎనిమిది నెలలు గడిచినా ఎప్పుడు హక్కు పత్రాలు ఇస్తారో చెప్పడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అటవీ అధికారులు పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గిరిజనులకు 15 వాగ్దానాలను చేసి, ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు చేయలేదన్నారు. అటవీ ప్రాంతంలోని ప్రతి తండా, గిరిజన గూడేల అభివృద్ధికి రూ.25లక్షలు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని, బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. అంబేద్కర్ అభయహస్తం పేరుతో ప్రతి గిరిజన కుటుంబానికి రూ.12లక్షలు రుణం ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో కనీసం దాని గురించి ప్రస్తావన కూడా తేలేదన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ ఏర్పాటు చేస్తామన్న హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్యా వీరభద్రం, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. రవినాయక్, రాష్ట్ర, జిల్లా నాయకులు భూక్యా పాండునాయక్, వెంకటేశ్వర్లు, బానోతు రాజు, స్వామినాయక్, వినోద్, సుమన్, గోపి, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకుడు పల్లె వెంకటరెడ్డి, జిల్లా నాయకులు వట్టెపు సైదులు, శీలం శ్రీను, పోషనబోయిన హుస్సేన్, జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్‌రన్‌మియా, రాము, కోటయ్య, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికంగా అభివృద్ధి



తిమ్మాపురంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు

- డీఏఓ శ్రీధర్‌రెడ్డి

అర్వపల్లి: ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో రైతులు నెమరుగొమ్ముల శిల్ప, రవీందర్‌రావులు నూతనంగా చేపట్టిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. సాగు చేసిన 4వ సంవత్సరం నుంచి దిగుబడి మొదలవుతుందని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి నాగయ్య మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందుసేద్యం, ఎరువులకు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఎకరానికి రూ.4,200 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50ఎకరాల వరకు డ్రిప్ రాయితీ వర్తిస్తుందన్నారు. నీటి వసతిగల రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిణి శ్రవంతి, ఏఓ మల్లారెడ్డి, పట్టు పరిశ్రమ అధికారి ముత్యాలు, ఏఈఓ ఎస్.సత్యం, పతంజలి ఆయిల్‌పామ్ డీజీఎం బి.యాదగిరి, మేనేజర్ హరీష్, ఫీల్డ్ అధికారి అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, పుల్యా పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ యూనివర్సిటీ ప్రాక్టికల్స్

రామగిరి (నల్లగొండ): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సైన్స్ విద్యార్థులకు గురువారం నుంచి నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4, 6వ సెమిస్టర్ కెమిస్ట్రీ, జియాలజీ పరీక్షలు గురువారం నుంచి 4వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. అలాగే, 5 నుంచి 8 వరకు బోటనీ, మ్యాథ్స్, జువాలజీ, ఫిజిక్స్, 1 నుంచి 12 వరకు కంప్యూటర్ అప్లికేషన్స్ ప్రాక్టికల్స్ జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయని పేర్కొన్నారు.

18 వరకు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్‌లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 18 వరకు అవకాశం ఉందని కళాశాల దూరవిద్య సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ సమాన డిప్లమో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏ, బీకాం, బీఎస్సీ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ మీడియంలలో అడ్మిషన్లు పొందవచ్చని, ఇతర వివరాలకు సెల్ : 9553568049, 7382929758 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎడమ కాల్వకు రేపు నీటి విడుదల

సాగర్‌కు 2,84,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 527 అడుగులకు చేరిన జలాశయ నీటిమట్టం
- రోజుకు 24టీఎంసీల నీరు రాక

నాగార్జునసాగర్: సాగర్ ఎడమ కాల్వకు శుక్రవారం నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. నల్లగొండ, ఖమ్మం జిల్లాల మంత్రులు నీటిని విడుదలకు రానున్నారు. కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్‌కు 2,84,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో సాగర్ జలాశయానికి 50 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. ఈ రెండు రోజుల్లో 24 టీఎంసీల నీరు చేరింది. సాగర్ జలాశయం నీటిమట్టం గత వారం క్రితం 503 అడుగులుండగా.. ప్రస్తుతం 526.80 అడుగులకు చేరింది. మరో 151 టీఎంసీల నీరు చేరితే నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుతుంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు). ఇదే రీతిలో వరద కొనసాగితే ఆరు రోజుల్లో జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని సాగునీటి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 5,944 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏఎమ్మార్పీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వరద కాల్వకు, ఏఎమ్మార్పీకి నీటిని విడుదల చేయాలి

చెరువులను నింపేందుకు వరద కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్ జలాశయంలో 530 అడుగుల నీరు చేరితే మోటర్ల ద్వారా వరద కాల్వకు నీటిని విడుదల చేసే సౌలభ్యం ఉంది. ఈ కాల్వ ద్వారా పలు చెరువులు నింపడంతో పాటు నకిరేకల్ వరకు నీరు వెళుతుంది. దీంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశాలుంటాయని రైతులు పేర్కొంటున్నారు. అలాగే ఏఎమ్మార్పీ ద్వారా డిస్ట్రిబ్యూటర్లకు నీటిని వదిలితే చాలావరకు చెరువులు నిండటంతో పాటు ఇప్పటికే బోరుబావుల కింద వరినార్లు పోసుకున్న రైతులు నాట్లు వేసుకునేందుకు వీలవుతుంది.

మంత్రుల చేతులమీదుగా నీటి విడుదల

- నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్




బీసీగురుకులంలో హెలిపాడ్‌ను పరిశీలిస్తున్న డ్యాం ఈఈ మల్లికార్జున్, డీఎస్పీ, సీఐ

నల్లగొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువకు శుక్రవారం నీటి విడుదల చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ తెలిపారు. బుధవారం నల్లగొండలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎడమ కాలువకు నీటి విడుదల ద్వారా నల్లగొండ, ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలు సేద్యం అవుతాయని, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సాగర్ ఎడమ కాలువ నీటి విడుదల కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి హాజరవుతాయని చెప్పారు.

ఎర్తుడ్యాంను సందర్శించిన అధికారులు

సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసేందుకు శుక్రవారం మంత్రులు వస్తున్న దృష్ట్యా డ్యాం ఈఈ మల్లికార్జున్‌తో కలిసి మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, సాగర్ సీఐ బీసన్న బుధవారం ఎడమ కాల్వ హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శించారు. అనంతరం హిల్‌కాలనీలో బీసీగురుకుల ఆవరణలోని హెలిపాడ్‌ను పరిశీలించారు. సాగర్ డ్యాం, విజయ విహార్ తదితర ప్రాంతాలను సందర్శించారు.



సాగర్ జలాశయం

మా గ్రామ పాఠశాలకు టీచర్లను పంపించండి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సూర్యాపేటటౌన్ : తమ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సరిపడా టీచర్లు లేరని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధ్యాయులను పంపించాలని కోరుతూ చింతలపాలెం మండలం చింత్రియాల గ్రామస్తులు బుధవారం డీఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. గతంలో ఎనిమిది టీచర్లు ఉండేవారని ప్రస్తుతం ఇద్దరే ఉండటంతో విద్యార్థులకు బోధించేవారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వెంటనే టీచర్లను పంపించాలని కోరారు. అలాగే యూపీఎస్ నుంచి హై స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

సుదీర్ఘకాలం సేవలు అందించడం అభినందనీయం



హమీద్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

సూర్యాపేటటౌన్ : పోలీస్‌శాఖలో హమీద్ హుస్సేన్ సుదీర్ఘ కాలం సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. హుజూర్‌నగర్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న హమీద్ హుస్సేన్‌ను బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యో విరమణ అనంతరం కుటుంబ సభ్యులందరితో సుఖ సంతోషలతో గడపాలని, ప్రజా సేవలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ మంజు భార్గవి, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సభ్యులు అంజన్ రెడ్డి, కృష్ణ, దాసు, సిబ్బంది, కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.

తొలిమెట్టులోనే లక్ష్యం ఎంచుకోవాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

సూర్యాపేటటౌన్ : జీవితానికి తొలిమెట్టు పదవ తరగతి నుంచి మొదలవుతుందని జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని దానికనుగుణంగా నడుచుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని గిరినగర్‌లో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, హనుమానగర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా గిరినగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, వచ్చిన ప్రతి పేషెంట్‌కు అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ శాంపిల్స్ అన్నింటినీ టీ హబ్ కు రెగ్యులర్‌గా పంపుతున్నారా.. రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా అని ఆరాతీశారు. డెంగీ, మలేరియా కేసులపై వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులను జాగ్రత్తగా పరిశీలించి మందులు అందజేయాలన్నారు. అక్కడి నుంచి హనుమాన్‌నగర్‌లోని హై స్కూల్ తనిఖీ చేశారు. స్టాఫ్ రూమ్ లో అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి అనంతరం పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించారు. 9వ తరగతి డ్రాయింగ్ క్లాసులో కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. డ్రాయింగ్ లో మెళకువలను పిల్లలకు నేర్పాలని డ్రాయింగ్ టీచర్ సత్యంను సూచించారు. 10వ తరగతి గదిని పరిశీలించారు. బాగా చదివి అందరూ 10జీపీఏ సాధించాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు నాలెడ్జ్, నైపుణ్యం, పర్సనాలిటీ తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయుడు యతిపతిరావు, మెడికల్ ఆఫీసర్ శివప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ సుష్మ ఉన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయంలో కేంద్ర మంత్రి పూజలు



పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి ఆలయంలోని అర్చకుడు ఆశీర్వచనం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొంది కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా ఆలయానికి వచ్చి మొక్కు చెల్లించుకున్నట్లు తెలిసింది. ఆయన వెంట ఆలయ మేనేజర్ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



రమేష్ (ఫైల్)

కొండమల్లేపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దేశముఖోనికుంటకు చెందిన ఏకుల రమేష్(36) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి అతడు కొండమల్లేపల్లి నుంచి తన స్వగ్రామం దేశముఖోనికుంటకు బైక్‌పై వెళ్తుండగా.. చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని ఉద్యానవన కేంద్రం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

బొమ్మలరామారం: పళ్లు తోముకోవాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కొడుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలంలోని మాల్యాల గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన కొమ్ము డానియల్, మరియమ్మ దంపతులు తమ ముగ్గురు కొడుకులతో కలసి గత కొన్నేళ్లుగా బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటకు కాపలాగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వారి చిన్న కుమారుడు కొమ్ము చంద్రశేఖర్ బొమ్మలరామారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం చంద్రశేఖర్ పళ్లు తోముకోకుండా అన్నం తింటున్నాడు. దంతాలను శుభ్రం చేసుకోకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయని తల్లి మరియమ్మ చంద్రశేఖర్‌ను మందలించింది. దీంతో కుటుంబ సభ్యులను తిట్టుకుంటూ చంద్రశేఖర్ తోట పక్కనే గల మరో మామిడి తోటలోకి వెళ్లి చీరతో ఉరేసుకున్నాడు. తోటలోని కాపరి గమనించి మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే చంద్రశేఖర్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

బలహీనంగా సాగర్ ఎడమ కాల్వ కట్ట





అన్నపరెడ్డిగూడెం-వేములపల్లి మధ్య అధ్వానంగా ఎడమ కాల్వ

పలుచోట్ల అధ్వానంగా కాల్వ లైనింగ్

- గతంలో నిడమనూరు వద్ద పడిన గండితో నీట మునిగిన వందల ఎకరాలు
- ప్రస్తుతం చేపడుతున్న మరమ్మతుల పనుల్లోనూ కొరవడిన నాణ్యత
- రేపు కాల్వలకు నీళ్లు వదిలే అవకాశం
- మరోసారి గండి పడితే పంట, ప్రాణ నష్టం తప్పదంటున్న రైతులు

మిర్యాలగూడ: కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో అధికారులు నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. రేపు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు నీటిని వదిలే అవకాశం ఉంది. అయితే సాగర్ ఎడమ కాల్వ కట్ట పలుచోట్ల బలహీనంగా ఉండడంతో ఎక్కడ గండి పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. 2022 సెప్టెంబర్‌లో నిడమనూరు మండల పరిధిలో ఎడమ కాల్వకు గండి పడడంతో వందలాది ఎకరాలు నీట మునిగాయి. అధికారులు, సిబ్బంది తప్పిదంతోనే ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటన తర్వాత నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఎడమ కాల్వ మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించగా.. లైనింగ్, బెడ్డింగ్ పనులను ఈ ఏడాది ఏప్రిల్ వరకు పూర్తిచేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించింది. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తుండడంతో ఎడమ కాల్వకు మరో గండి పడే అవకాశం లేకపోలేదని రైతులు అంటున్నారు.

కాల్వ మరమ్మతులకు రూ.44.78కోట్లు..

సాగర్ ఎడమ కాల్వకు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం రూ.44.78కోట్లు కేటాయించింది. నల్లగొండ జిల్లాలో 1.89కి.మీ. నుంచి 73.800కి.మీ. వరకు రూ.15.78కోట్లు, సూర్యాపేట జిల్లాలో 74కి.మీ. నుంచి 133కి.మీ. వరకు రూ.29కోట్లు కేటాయించగా కాంట్రాక్టర్ పనులను ఆలస్యంగా, నాసిరకంగా చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ ఆలస్యంగా పనులు చేస్తుండడంతో ఇంకా 20శాతం పనులు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం పలు చోట్ల లైనింగ్, ఫ్లోరింగ్ దెబ్బతినడంతో రూ.30కోట్లతో అధికారులు మళ్లీ ప్రతిపాదనలు పంపారు. నాణ్యత లోపం వల్ల పలు చోట్ల లైనింగ్ వేసిన కొద్దిరోజులకే ధ్వంసమైపోతుంది. నల్లగొండ జిల్లా పరిధిలో ఎడమ కాల్వపై మొత్తం 30 యూటీలు (కాల్వ కిందుగా వర్షం నీరు ప్రవహించేవి) ఉండగా ప్రస్తుతం ఐదు యూటీల వద్ద మరమ్మతు పనులు చేస్తున్నారు.

85శాతం పనులు పూర్తి

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ లైనింగ్, ఫ్లోరింగ్ పనులు 85శాతం మేర పూర్తయ్యాయి. మిగిలిన పనులు మరో మూడురోజుల్లో పూర్తిచేస్తాం. మట్టి వదులుగా ఉండడంతో ఒక చోట కొత్తగా వేసిన లైనింగ్ కిందకి జారిపోయింది. అక్కడ మరమ్మతులు చేపడుతున్నాం. కురియాతండా వద్ద లైనింగ్ పనులు మూడు రోజుల్లో పూర్తవుతాయి.

– లక్ష్మణ్, ఎన్ఎస్‌పీ ఈఈ, మిర్యాలగూడ

మొత్తం 54 మేజర్లు..

ఎడమ కాల్వ పరిధిలో మొత్తం 54 మేజర్లు ఉండగా నల్లగొండ జిల్లాలో 30, సూర్యాపేట జిల్లాలో 24 మేజర్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో మేజర్ల కింద 98,030 ఎకరాలు, 31 ఎత్తిపోతల పథకాల కింద 47,690 ఎకరాల సాగు భూమి ఉంది. సూర్యాపేట జిల్లాలో మేజర్లు ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 2.35లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నల్లగొండ జిల్లాలో రాజవరం, సూరేపల్లి, నార్కెట్లగూడ, ముదిమాణిక్యం, వజీరాబాద్, కిష్టాపురం, ముల్కలకాల్వ మేజర్ల కింద 2వేల ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగి ఉన్నాయి. ప్రధాన కాల్వ ద్వారా 11వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉండగా మేజర్లకు గరిష్టంగా 156క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉంది. 2010లో సుమారు రూ.440కోట్లతో చేపట్టిన ఎడమ కాల్వ ఆధునీకరణ పనులకు నిధులు సరిపోక పూర్తిచేయకపోవడంతో మేజర్ల లైనింగ్ మధ్యలో ఆగిపోయింది. అన్ని మేజర్లు, కాల్వలకు లైనింగ్, ఫ్లోరింగ్ చేయడం ద్వారా నీరు వృథాకాకపోవడంతో పాటు చివరి భూములకు సైతం నీరందించే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.



మిర్యాలగూడ మండల కురియాతండా వద్ద దెబ్బతిన్న ఎడమ కాల్వ లైనింగ్



అన్నపరెడ్డిగూడెం-వేములపల్లి మధ్యన తూము వద్ద కాల్వ లైనింగ్ దుస్థితి ఇదీ..

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

దేవరకొండ: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ ఘటన బుధవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల.. కొండభీమనపల్లి గ్రామానికి చెందిన కనకటి లక్ష్మమ్మ తన ఇంటి వద్ద కూర్చొని ఉండగా.. గుర్తుతెలియని వ్యక్తి కారులో వచ్చి కొన్ని మంచినీళ్లు ఇవ్వమని ఆమెను అడిగాడు. దీంతో లక్ష్మమ్మ ఇంట్లో నుంచి మంచినీళ్లు తెచ్చి ఇస్తుండగా సదరు వ్యక్తి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. లక్ష్మమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం, సారా పట్టివేత



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: అక్రమంగా తరలిస్తున్న బెల్లం, సారాను బుధవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలంలోని వెల్లటూరు కాలనీకి చెందిన దాసు వీరబాబు తన టాటా ఇంట్రా వాహనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నుంచి 120 కిలోల బెల్లం, 5లీటర్ల సారా తీసుకొస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున చింతలపాలెం మండలం దొండపాడు వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాసు వీరబాబుపై, అతడికి బెల్లం అమ్మిన జగ్గయ్యపేటకు చెందిన వ్యాపారి సంక వెంకటరావుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నాగరాజు, రవి, రుక్మారెడ్డి, నాగయ్య, గోపిరెడ్డి, సంజయ్, నవీన్, మధు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

- కిలో గంజాయి, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను కనగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి బుధవారం కనగల్ ఎస్ఐ రామకృష్ణ, సీఐ వెంకటయ్యతో కలిసి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలో బృందావన్ కాలనీకి చెందిన పెద్దగోని అరవింద్, గుర్రంపోడు మండలం చేపూర్ గ్రామానికి చెందిన సీతా వంశీ, కొమ్ము అనిల్, కనగల్ మండలం ఎడవెల్లి గ్రామానికి చెందిన చిన్నపాక అరుణ్‌కుమార్ స్నేహితులు. వీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో గంజాయి కొనుగోలు చేసి దానిని కనగల్ మండలం దర్వేశిపురం వద్ద ఇతరులకు విక్రయించేందుకు వేచి ఉండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు కనగల్ ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి కిలో గంజాయి, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాలో భాగస్వాములైన రవికిరణ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, పురం గణేష్ అనే మరో వ్యక్తి జైలులో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి తాగేవారు, విక్రయించే వారి వివరాలను 8712670266 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది రమేష్, సురేష్, వెంకన్న, వీరయ్య, సర్ఫరాజ్, వెంకట్‌రెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్య



రమణారెడ్డి (ఫైల్)

మిర్యాలగూడ: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. వాడపల్లి ఎస్ఐ రవి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కంచరకుంట్ల రమణారెడ్డి(39) స్థానికంగా పాత ఇనుప సామాను దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య సుమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్ని రోజులుగా రమణారెడ్డికి, అతడి భార్య మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం సైతం ఇంట్లో ఇరువురి మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో రమణారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన రమణారెడ్డి తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి వరుసకు సోదరుడైన చిట్యాల మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తలకు గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆస్పత్రిలో రమణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



వినయ్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కానుగంటి వినయ్(20) హైదరాబాద్‌లోని బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 25వ తేదీన సాయంత్రం వంగపల్లి గ్రామంలోని తన నివాసం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలో వంగపల్లి గ్రామ శివారులో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై వ్యవసాయ కూలీలను తీసుకుని గ్రామానికి చెందిన ఆటో రాంగ్‌రూట్‌లో వస్తుంది. ఈ క్రమంలో ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వినయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని షెడ్‌లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో లేదా ఆస్పత్రి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.



చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో విజయవాడ-హైదరాబాద్ హైవేపై బుధవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొనడంతో పట్టణ కేంద్రంలో భారీగా నిలిచిపోయిన వాహనాలు - చౌటుప్పల్

రూ.9లక్షలు, 12 తులాల బంగారు ఆభరణాలు చోరీ

- 30 తులాల వెండి వస్తువులు కూడా ఎత్తుకెళ్లిన దుండగులు

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ పంచాయతీ మదిర గ్రామమైన బొర్రోళ్లగూడెంలో భారీ దొంగతనం జరిగింది. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్రోళ్లగూడేనికి చెందిన ములుగు ప్రభాకర్ తన సమీప బంధువు చనిపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లాడు. అంత్యక్రియలు రాత్రి 11గంటలకు పూర్తవ్వడంతో కుటుంబ సభ్యులు అందరూ అక్కడే ఉండిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.9లక్షలు, 12 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పక్కింట్లో నివాసముంటున్న మల్లేష్ దొంగతనం జరిగినట్లు గుర్తించి ప్రభాకర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఇంటికి చేరుకున్న ప్రభాకర్ డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు

బొమ్మలరామారం: కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఆటోను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బొమ్మలరామారం మండల కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బొడ్డెల్లి బాలయ్య(54) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం స్వగ్రామం నుంచి ఆటోలో తన కుటుంబ సభ్యులతో కలసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కుషాయిగూడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బొమ్మలరామారం మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద హైదరాబాద్ నుంచి బొమ్మలరామారం వైపు వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బాలయ్యతో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో బాలయ్య మృతిచెందాడు. కారు డ్రైవర్ వేమూరి హరిబాబుకు సైతం గాయాలయ్యాయి. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. పలువురికి గాయాలు



చివ్వెంల: సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు



నాగార్జునసాగర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెద్దవూర: మండల కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుమలగిరి(సాగర్) మండలం గరికెనెట్‌తండాకు చెందిన సపావత్ శ్రీనునాయక్ బైక్‌పై జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి గుండా హాలియా నుంచి పెద్దవూర వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో పెద్దవూర మండల కేంద్రం సమీపంలో రోడ్డు విస్తరణలో పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో పోసిన మట్టి, రాళ్ల కుప్పల పైకి బైక్‌ను పోనిచ్చాడు. ఈ క్రమంలో శ్రీను పక్కనే ఉన్న పెద్ద బండరాయిపై పడటంతో అతడి తల, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ పి. వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసు వాహనంలోనే నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు.

సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు మార్గమధ్యలో దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఎంఎస్ఆర్ కాలేజీ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

రెండు కార్లు ఢీ..

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. విజయపురిటౌన్ ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల నుంచి కారులో నాగలక్ష్మి, దినకర్ హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి సిద్దార్థ, రాజు, సతీష్, సంతోష్ మాచర్లకు వెళ్తున్న కారులో వెళ్తున్నారు. ఈ రెండు కార్లు విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో గల మూలమలుపు వద్ద ఎదురెదురుగా కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. కార్లు రోడ్డుపైనే ఉండటంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రెండు కార్లలో ఇరుక్కపోయిన వారిని బయటకు లాగి ఆస్పత్రికి తరలించారు. కార్లను రోడ్డు పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా..

మునుగోడు: భూవివాదం పరిష్కారం కోసం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటన మునుగోడు మండలం కొంపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగింది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి గ్రామానికి చెందిన గంజి శివ, గంజి పరమేష కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వారిద్దరు పాలివారు కాగా.. గ్రామంలో ఉన్న ఐదెకరాల భూమి విషయంలో ఇరు కుటుంబాల మధ్య గత 10 ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. వివాదం నడుస్తున్న భూమిలో గంజి శివ ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. ఇరువురు పెద్దమనుషులను ఆశ్రయించగా.. బుధవారం గ్రామ పెద్దలు ఇరువురిని హైదరాబాద్ నుంచి పిలిపించి మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ వారి మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో తిరిగి మధ్యాహ్న సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరారు. గంజి పరమేష తన తో పాటు వచ్చిన ఓ వ్యక్తిని తీసుకొని బైక్‌పై వెళ్లగా.. ఆ వెంటనే కారులో గంజి శివ బయల్దేరాడు. అయితే గ్రామ శివారులోని ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో శివ కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా.. బైక్‌పై వెళ్తున్న పరమేషకు స్వల్ప గాయాలు, అతని వెంట ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.